సాక్షి

కుమురం భీం

బుధవారం । 6 । సెప్టెంబర్ । 2023



ఉపాధ్యాయులకు వందనం

జిల్లాలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరుపుకొన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 9లో▸

న్యాయవాదులతో సమావేశం

సిర్పూర్(టి): జూనియర్ సివిల్ కోర్టులో మంగళవారం మేజిస్ట్రేట్ పి.రవి న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ నెల 9న నిర్వహించే లోక్అదాలత్‌లో రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. న్యాయవాదులు కిషోర్ కుమార్, రైజ్ అహ్మద్, శంకర్‌రావు, దయారాజ్ సింగ్, శ్రీనివాస్, గణపతి, కల్యాణ్, సతీశ్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం

29.6 /25.3

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. తుపాను ప్రభావంతో జిల్లాలోని చాలాప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

కాగజ్‌నగర్‌టౌన్: ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కేఎస్ ఆశాలత అన్నారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో ఈ నెల 3, 4 తేదీల్లో కాగజ్‌నగర్ పట్టణంలోని పోచమ్మ బస్తీ, అంబేద్కర్ కాలనీ, జైభీం కాలనీ, సర్దార్ బస్తీల్లో సర్వే నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని, పట్టణ పరిష్కరించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తి గా విఫలమయ్యారని ఆరోపించారు. పట్టణంలో కాలుష్యం, ఉద్యోగాలు, ఎస్పీఎం పేపర్ మిల్లు తదితర విషయాలను తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. పేపర్ మిల్లు కాలుష్యంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, కాలుష్య నియంత్రణకు యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు.

'భగీరథ' కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్అర్బన్: మిషన్ భగీరథ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం చెల్లించేలా చొరవ చూపాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లోకేశ్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ హేమంత్ బోర్కడేకు వినతిపత్రం సమర్పించారు. లోకేశ్ మాట్లాడుతూ సమ్మె చేస్తున్న కార్మికులను యాజమాన్యం భయభ్రాంతులకు గురి చేస్తుందని ఆరోపించారు. డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్మికులు ప్రకాశ్, ఈశ్వర్, అంబాజీరావు, మధుకర్, మహేశ్, పవన్, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన సరస్వతి



రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న సరస్వతి

ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశిస్తున్న మాజీ సర్పంచ్ మర్సుకోల సరస్వతి మంగళవారం హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని సూచించినట్లు ఆమె పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం


కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్‌లో అకాడమిక్ కౌన్సిలర్లుగా పనిచేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కోఆర్డినేటర్ దత్తాత్రేయ ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, సోషియాలజీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అండ్ అడ్మినిస్ట్రేషన్ సబ్జెక్టులు బోధించేందుకు అర్హులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 10 లోగా హార్డ్ కాపీలను కళాశాలలో అందించాలన్నారు.

ఫారెస్ట్ నర్సరీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్అర్బన్: జిల్లాలోని ఫారెస్ట్ నర్సరీల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో డీఎఫ్‌వో నీరజ్‌కుమార్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా దివాకర్ మాట్లాడుతూ ఫారెస్ట్ నర్సరీల్లో మొక్కలు పెంచడంలో కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. 15 ఏళ్లుగా చాలీచాలని వేతనాలు చెల్లిస్తూ ప్రభుత్వం శ్రమదోపిడీకి పాల్పడుతోందని ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి పెండింగ్ వేతనాలు చెల్లించడంతోపాటు రోజువారీ కూలి రూ.600 చెల్లించాలని, హెల్త్ కార్డులు, ఈఎస్ఐ, పీఎఫ్, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందించిన వారిలో నర్సరీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘమిత్ర, కార్మికులు ఉన్నారు.

ఆ.. ఏమైతది!?

- ఇలాంటివి ఎన్ని చూడలే..
- బదిలీ చేస్తరు.. మళ్లీ ఇదే జిల్లాలో పోస్టింగ్ ఇస్తరు
- అధికారపార్టీ నేతలను కాదని పనిచేయలేం
- కాగజ్‌నగర్‌లో ఓ పోలీసు అధికారి నిర్లక్ష్య ధోరణి
- సాక్షి కథనం 'దర్జాగా పేకాట!'పై చర్చ



సాక్షి, ఆసిఫాబాద్: జిల్లా పోలీసులంటే క్రమశిక్షణకు మారుపేరని.. విధుల్లో అంకితభావం ఉండేదని.. నిక్కచ్చిగా వ్యవహరించేవారని.. ఇక ప్రజల భద్రత కోసం నిరంతరం పనిచేస్తారని.. అసాంఘిక కార్యకలపాలపై ఉక్కుపాదం మోపేవారని ఒకప్పుడు ప్రజల్లో పేరుండేది.. ఇప్పుడు అందుకు భిన్నమైన పరిస్థితి పోలీసుశాఖలో నెలకొంది. మంగళవారం 'సాక్షి'లో 'దర్జాగా పేకాట!' అనే శీర్షికతో ప్రచురితమైన కథనం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశం కాగా.. అధికారపార్టీ నేతల మెప్పు కోసం 'పేకాట'కు అండగా నిలుస్తున్న కొందరు పోలీసుల్లో మాత్రం 'అ.. ఏమైతది!?' అనే నిర్లక్ష్య ధోరణి కనిపిస్తుంది.

'సిర్పూర్'.. అన్నింటికీ అడ్డా..!

సిర్పూర్ నియోజకవర్గం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ముఖ్యంగా కాగజ్‌నగర్ పట్టణం కల్తీకి కేరాఫ్‌గా నిలుస్తోంది. ఇక్కడ గుట్కా, పాన్ మసాలాలు, మద్యం ఇలా ఎన్నో కల్తీ ఉత్పత్తులను కొన్ని ముఠాలు మార్కెట్లో విక్రయిస్తూ భారీ గా అర్జిస్తున్నాయి. ఇక మట్కాకు ఈ నియోజకవర్గం ఓ డెన్‌గా మారిందంటే అతిశయోక్తికాదు. ఒకవైపు వరుస దాడుల్లో ఈ దందాలన్నీ మూతపడ్డాయని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్న మాటలకు.. ఇక్కడ జరుగుతున్న తీరుకు పొంతన ఉండడం లేదు. ఈ నియోజకవర్గానికి పొరుగున ఉన్న మహారాష్ట్రలోని జిల్లాలో ఒకప్పుడు మద్యపాన నిషేధం అమల్లో ఉండేది. ఆ సమయంలో ఇక్కడి నుంచి అక్కడకు భారీగా మద్యం సరఫరా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఇదే అదనుగా కల్తీ ముఠాలు.. మద్యం బాటిళ్ల నుంచి కొంత మద్యాన్ని తీసి.. అంతే మొత్తంలో స్పిరిట్ కలిపి మళ్లీ యథాతథంగా బాటిళ్లను సీల్ చేసి మహారాష్ట్ర జిల్లాల్లో విక్రయించి భారీగా సొమ్ము చేసుకున్నట్లు పోలీసు వర్గాలే చెబుతున్నాయి. గుట్కా, పాన్‌మసాలాల విషయంలోనూ అదే మాదిరి కల్తీ చేసి 'దో నంబర్' దందాకు తెరతీశారని సమాచారం. ఈ దందాలన్నీ నేటికీ కాగజ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతుండటం గమనార్హం.

పనిష్మెంట్ ఇచ్చినా.. పోస్టింగ్ ఇస్తరు

కాగజ్‌నగర్ పట్టణ, శివారు ప్రాంతాల్లో జోరుగా జరుగుతున్న పేకాటపై మంగళవారం 'సాక్షి'లో వచ్చిన కథనంపై ఓ పోలీసు అధికారి నిర్లక్ష్య ధోరణిలో మాట్లాడడం.. పోలీసుశాఖపై అధికారపార్టీ నేతల ఒత్తిళ్లు ఏ మేరకు ఉంటాయన్న విషయాన్ని బట్టబయలు చేస్తోంది. 'పేకాటపై కథనం వచ్చింది. ఆ.. ఏమైతది!? ఇట్లాంటి కథనాలు ఎన్ని చూడలే.. పోలీసుబాస్ చీవాట్లు పెడతారు. మహా అయితే బదిలీ చేస్తరు. అధికారపార్టీ నేతల ఆశీస్సులుంటే మళ్లీ కొన్నాళ్లకు ఇదే జిల్లాలో పోస్టింగ్ ఇస్తరు. అధికారపార్టీ నేతల్ని కాదని ఇక్కడ పనిచేయలేం' అని పేర్కొనడం క్రమశిక్షణారాహిత్యానికి అద్దం పడుతోంది. పోలీసుశాఖలో 'లెటర్ల' వ్యవస్థ వెళితేనే మళ్లీ ఆ శాఖ పూర్వవైభవాన్ని సంతరించుకుంటుందని స్థానికులు అభిప్రాయపడతున్నారు.

'పేకాట'కు పహారా..

కాగజ్‌నగర్‌లోని రెండు ప్రాంతాల్లో పేకాట జోరుగా సాగుతోందన్న విషయం నగ్న సత్యం. అధికారపార్టీ నేతల అనుచరులు ఈ రెండు శిబిరాలను నిర్వహిస్తుండడంతో పోలీసులు అటువైపు వెళ్లడానికి సాహసించడం లేదు. పైగా నేతల మెప్పు కోసం కొందరు పోలీసు అధికారులు ఆ జూద శిబిరాలకు పహారా కాస్తున్నారన్న ఆరోపణలున్నాయి. జూద శిబిరాల నిర్వాహకులు నెలానెలా వారికి పెద్దమొత్తంలో ముడుపులు ముట్టజెప్పుతుండటమే ఇందుకు కారణమని తెలుస్తోంది. ముఖ్యంగా స్థానికంగా ఉన్న ఓ అధికారికి రూ.లక్ష.. సిబ్బందికి రూ.50 వేలు.. జిల్లా వ్యాప్తంగా ఎక్కడైనా దాడులు నిర్వహించే మరో టీం సభ్యులకు రూ.లక్షకు పైగా మామూళ్లు ఇస్తున్నామని ఆ నిర్వాహకులే బాహాటంగానే పేర్కొంటుండడం గమనార్హం. పోలీసుశాఖలోనూ అధికార పార్టీ నేతలు చెప్పినట్లు నడుచుకుంటేనే పోస్టింగ్ పదిలమనే భావన నెలకొనడంతో విచ్చలవిడిగా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

రాజకీయ పార్టీల భాగస్వామ్యం కీలకం

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- ఓటరు జాబితా రూపకల్పనపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించడంలో రాజకీయ పార్టీల భాగస్వామ్యం కీలకమని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణుతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా రూపకల్పనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండో ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 19 వరకు నూతన ఓటరు నమోదు, మార్పుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు అర్హులకు అవగాహన కల్పించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో బూత్ స్థాయి అధికారులు, తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు అధికారులకు సహకరించాలన్నారు. సమావేశంలో ఆర్డీవో రాజేశ్వర్, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా విధులు నిర్వర్తించాలి

- ఎస్పీ సురేశ్‌కుమార్



మాట్లాడుతున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్: జిల్లాలోని పోలీసులు ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో మంగళవారం అసెంబ్లీ ఎన్నికల నియామవళి, భద్రతా చర్యలపై పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ నియోజకవర్గాలకు డీఎస్పీలు ఇన్‌చార్జీలుగా ఉంటూ బందోబస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో, ఎన్నికల ముందు, తర్వాత తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన ఉండాలన్నారు. గ్రామాల్లో సమస్యలు సృష్టించే వారిని బైండోవర్ చేయాలని సూచించారు. గత ఎన్నికల సమయంలో సమస్యలు సృష్టించిన వారిపై పూర్తి నిఘా ఉంచి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లా ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ప్లాన్ ప్రకారం బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ రోజు 144 సెక్షన్ అమలు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో రెవెన్యూ శాఖకు చెందిన ఎలక్షన్ సెల్ ఇన్‌చార్జి మధుకర్, డీఎస్పీలు శ్రీనివాస్, కరుణాకర్, డీసీఆర్‌బీ డీఎస్పీ రమేశ్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాణాప్రతాప్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'బీసీల సింహగర్జన' విజయవంతం చేయాలి

కాగజ్‌నగర్‌టౌన్: ఈ నెల 10న హైదరాబాద్‌లో నిర్వహించే బీసీల సింహగర్జన సభను విజయవంతం చేయలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నర్ రమేశ్ కోరారు. కాగజ్‌నగర్ పట్టణంలో మంగళవారం సింహగర్జనకు సంబంధించిన పోస్టర్లను సంఘం నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 60 సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం, సబ్బండ కులాలకు రాజ్యాధికారం దక్కాలనే నినాదంతో ఈ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కురిసిన వర్షం.. ఉప్పొంగిన వాగులు



కెరమెరి మండలంలోని సాంగ్వి కల్వర్టు పైనుంచి పారుతున్న వరద

- కుమురంభీం, వట్టివాగు ప్రాజెక్టుల్లోకి భారీగా వరద
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

ఆసిఫాబాద్: జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాగులు, ఒర్రెలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జిల్లా కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. మూడు గంటల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పట్టణంలోని దుకాణాలు, వ్యాపార సముదాయాల్లో అమ్మకాలు లేక వెలవెలబోయాయి.

ప్రాజెక్టుల్లోకి వరద..

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టుల్లోకి వరద కొనసాగుతోంది. రెండు రోజుల క్రితం కుమురంభీం(అడ) ప్రాజెక్టు గేట్లు ఎత్తిన అధికారులు మంగళవారం కూడా రెండు గేట్ల ద్వారా 2,882 క్యూసెకుల నీటిని దిగువకు వదులుతున్నారు. వట్టివాగు ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 239.500 మీటర్లు కాగా, ప్రస్తుతం 238.500 మీటర్లకు చేరింది. వరద కొనసాగితే గేట్లు ఎత్తుతామని అధికారులు ప్రకటించారు. దిగువన ఉన్న కేరిగూడ, పాడిబండ, చిర్రకుంట, చిలాటిగూడ, గొడవెల్లి, ఆసిఫాబాద్‌తోపాటు పట్టణంలోని రావులవాడ, మేకలవాడ, రాజూర, బ్రాహ్మణవాడ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆసిఫాబాద్ మండలం గుండి వాగు ఉప్పొంగడంతో గ్రామం నుంచి జిల్లా కేంద్రానికి రాకపోకలు నిలిచిపోయాయి. ప్రజలు నాటు పడవల్లో రాకపోకలు సాగిస్తున్నారు. కొంతమంది వాంకిడి మండలం ఖమాన మీదుగా తిరిగి పట్టణానికి చేరుకుంటున్నారు.

18.6 మిల్లీమీటర్ల వర్షం

జిల్లాలో మంగళవారం 18.6 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు కాగా, లింగాపూర్‌లో అత్యధికంగా 56.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జైనూర్‌లో 37, సిర్పూర్(యూ) 36.2, తిర్యాణి 2.4, రెబ్బెన 4.2, ఆసిఫాబాద్ 4.2, కెరమెరి 35.6, వాంకిడి 2.6, కాగజ్‌నగర్ 5.4, సిర్పూర్(టి) 23.6, కౌటాల 9.6, చింతలమానెపల్లి 13.2, బెజ్జూర్ 21.6, పెంచికల్‌పేట్ 14.2, దహెగాం 12.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



సరాండి లోలెవల్ వంతెన పైనుంచి వరద

వాంకిడి: మండలంలోని సరాండి లోలెవల్ వంతెన పైనుంచి ఒర్రె ఉప్పొంగి ఉధృతంగా ప్రవహించడంతో ఇందాని, ఖిరిడి గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాలకు రాకపోకల్లో అంతరాయం కలిగింది. ఖమాన ఒర్రె, పిప్పర్‌గొంది, అకిని, ఉట్టివాగు తదితర వాగులు ఉధృతంగా ప్రవహించాయి. సరాండి లోలెవల్ వంతెనను తహసీల్దార్ రహీముద్దీన్, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి పరిశీలించారు.

కెరమెరి: మండలంలోని లక్మాపూర్, అనార్‌పల్లి వాగులు ఉప్పొంగడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. సాంగ్వి, కెలి కె, ఇంద్రానగర్ గ్రామాల మధ్య కల్వర్టుల పైనుంచి వరద ప్రవహించింది. వాగుల్లో ఉధృతి తగ్గే వరకు ప్రజలు వేచిచూసి ప్రయాణాలు సాగించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆసిఫాబాద్అర్బన్: జిల్లాకు వర్ష సూచనలు ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరదలు వచ్చే అవకాశం ఉన్న లోతట్టు ప్రాంతాల్లోని వారు అప్రమత్తంగా ఉండాలని, అధికార యంత్రాంగం నిత్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు. చెరువులు, ఉధృతంగా ప్రవహిస్తున్న నదులు, వాగులు వద్దకు వెళ్లొద్దని, విద్యుత్ స్తంభాలు, చెట్ల కింద ఉండొద్దని సూచించారు. అత్యవసరం అయితేనే ప్రజలు బయటికి రావాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజల కోసం పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, అత్యవసర సమయంలో 63046 86505 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా 44 మంది ఎంపిక



ఉత్తమ ఉపాధ్యాయులతో జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే సక్కు, డీఈవో అశోక్, తదితరులు

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులకు జ్ఞానాన్ని పంచుతూ ఉన్నతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 44 మందిని శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ముందుగా కలెక్టర్‌తోపాటు జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీఈవో అశోక్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ దేశ సంస్కృతిలో తల్లిదండ్రుల తర్వాత స్థానాన్ని గురువులకు ఇచ్చారని తెలిపారు. డీఈవో మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేసేది ఉపాధ్యాయులేనని పేర్కొన్నారు. పాఠ్యాంశాలతోపాటు జీవిత పాఠాలతో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్, ఎంఈవోలు, ఎస్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు

పేరు	హోదా	పాఠశాల
వరలక్ష్మి	హెచ్ఎం	జెడ్పీఎస్ఎస్ సర్‌సిల్క్,
రమేశ్‌బాబు	హెచ్ఎం	జెడ్పీఎస్ఎస్ సలుగుపల్లి
శ్రీనివాసరావు	హెచ్ఎం	జెడ్పీఎస్ఎస్ గజ్జిగూడ
మహేశ్	పీజీటీ	మోడల్‌స్కూల్ ఆసిఫాబాద్
రవీందర్	ఎస్ఏ	జెడ్పీఎస్ఎస్ కెరమెరి
శ్యాంరావు	హెచ్ఎం	జెడ్పీఎస్ఎస్ కౌటాల
తిరుమలేష్	హెచ్ఎం	ఎంపీపీఎస్ సుల్తానగూడ
పోచ్చయ్య	హెచ్ఎం	ఎంపీపీఎస్ కుంచవెల్లి
భాస్కర్	హెచ్ఎం	ఎంపీపీఎస్ కెరమెరి
గోపాల్	ఎస్ఏ	ఎంపీయూపీఎస్ రాంజీగూడ
రాజేశం	ఎస్ఏ	జెడ్పీఎస్ఎస్ ఆరెగూడ
లేవన్‌కుమార్	ఎల్‌పీ	ఎంపీయూపీఎస్ ఝరి
రమేశ్	ఎస్జీటీ	ఎంపీపీఎస్ సావర్‌ఖేడా
అనిత కుమారి	ఎస్జీటీ	ఎంపీపీఎస్ ఆరెగూడ
గోవింద్‌రావు	ఎస్జీటీ	ఎంపీపీఎస్ టీఆర్‌నగర్
రవీందర్‌చారి	ఎస్జీటీ	ఎంపీపీఎస్ గోవింద్‌పూర్
ఓంప్రకాశ్	ఎల్‌పీ	జెడ్పీఎస్ఎస్ నవేగాం
తిరుపతి	ఎస్జీటీ	ఎంపీపీఎస్ వేంపల్లి
రాజేశ్వర్‌రావు	ఎస్జీటీ	ఎంపీపీఎస్ భట్‌పల్లి
సునీత	ఎల్‌పీ	జెడ్పీఎస్ఎస్ భట్‌పల్లి
దివ్యశ్రీ	ఎస్జీటీ	ఎంపీపీఎస్ కాల్లేగాం కోటారి
ప్రవీణ్ కుమార్	పీఈటీ	జెడ్పీఎస్ఎస్ కెరమెరి
రత్నం సంజీవ్	ఎస్జీటీ	ఎంపీపీఎస్ బ్రహ్మణచిచాల
గాయత్రి	ఎల్‌పీ	జెడ్పీఎస్ఎస్ రాస్పెల్లి
రవీందర్	ఎల్‌పీ	ఎంపీయూపీఎస్ దబోలి
ఇందురావు	ఎస్జీటీ	ఎంపీపీఎస్ ఖిరిడి
ధర్మబాయి	హెచ్ఎం	ఎంపీపీఎస్ బంబార
గోపి	ఎస్జీటీ	ఎంపీపీఎస్ ఇట్యాల
వెంకటేశం	ఎల్‌పీ	ఆశ్రమ పాఠశాల, రొంపెల్లి
కిరణ్	ఎస్ఏ	ఆశ్రమ పాఠశాల, కల్వాడ
ఎస్.వెంకటేశం	సీఆర్పీ	ఆశ్రమ పాఠశాల, సలుగుపల్లి
మనోహర్	ఎస్జీటీ	ఆశ్రమ పాఠశాల, వాంకిడి
లక్ష్మీనారాయణ	సీఆర్టీ	ఆశ్రమ పాఠశాల, వాంకిడి
తిరుపతి	హెచ్ఎం	ఆశ్రమ పాఠశాల, మోవాడ్
శ్రీనివాస్	ఎస్ఏ	ఆశ్రమ పాఠశాల, మొగడ్‌దగడ్
అరుణ	ఎస్ఏ	ఆశ్రమ పాఠశాల, జైనూర్
సీతారాం	ఎస్జీటీ	జీపీఎస్ అమృత్‌రావుగూడ
దేవిదాస్	ఎస్ఏ	ఆశ్రమ పాఠశాల, మహాగాం
నాగసుధారాణి	ఎస్‌వో	కేజీబీవీ, సిర్పూర్-టి
కల్పన	సీఆర్టీ	కేజీబీవీ, ఆసిఫాబాద్
శైలు	ప్రిన్సిపాల్	టీఎస్ ఈఎంఆర్ఎస్ సిర్పూర్-టి
వెంకటప్రసాద్	ప్రిన్సిపాల్	ఎంజేపీ, ఆసిఫాబాద్
సంధ్యారాణి	ప్రిన్సిపాల్	టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ సిర్పూర్-టి
ఫ్రాన్సిస్	పీటీజీ	టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ సిర్పూర్-టి

శిక్షణతో నిరుద్యోగులకు ఉపాధి

- జీఎం రవిప్రసాద్



మాట్లాడుతున్న జీఎం రవిప్రసాద్

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో బెల్లంపల్లి ఏరియాలోని అందిస్తున్న శిక్షణతో నిరుద్యోగ మహిళలు, యువతీ యువకులకు ఉపాధి అవకాశం లభిస్తుందని జీఎం రవిప్రసాద్ అన్నారు. గతేడాది ఏరియా సేవా సమితి ఆధ్వర్యంలో స్వయం ఉపాధి శిక్షణ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి మంగళవారం గోలేటిలోని సీఈఆర్ క్లబ్‌లో రాతపరీక్షలు నిర్వహించారు. జీఎం మాట్లాడుతూ టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, మోటర్ డ్రైవింగ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న యువత నేడు స్వయం ఉపాధిలో రాణిస్తున్నారని పేర్కొన్నారు. సింగరేణి ఉద్యోగులతోపాటు వారి కుటుంబాల సంక్షేమానికి యాజమాన్యం కట్టుబడి పని చేస్తుందన్నారు. సింగరేణి సేవా సమితి చీఫ్ కోఆర్డినేటర్ శివకుమార్, కేజీఎంపీ అధికారి బానోత్ నరేశ్, డీవైపీఎం రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పీవో ప్రశాంత్, శిక్షకులు రూప, లక్ష్మి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ తీగలు తెగిపడి ఐదు గేదెలు మృతి



మృతి చెందిన గేదెలు

కాసిపేట(బెల్లంపల్లి): మండలంలోని దేవాపూర్ సమీపంలో మంగళవారం విద్యుత్ తీగలు తెగిపడడంతో ఐదు గేదెలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మేతకు వెళ్లిన గేదెలు వర్షంలో ఇంటికి తిరిగి వస్తుండగా విద్యుత్ తీగలు తెగి వాటిపై పడడంతో గ్రామానికి చెందిన గడ్డి కుమార్, పార్వతి సత్తయ్య, షేక్ ఇమామ్, కసర్ల లస్మయ్య, జంగిల్ రాజ్‌కుమార్‌లకు చెందిన గేదెలు మృతి చెందాయి. సమీపంలోని చేనులో గల టేకు చెట్టు విరిగి లోటెన్షన్ తీగలపై పడటంతో వైర్లు తెగినట్లు విద్యుత్‌శాఖ ఏఈ స్వర్ణలత తెలిపారు. బాధితులు వివరాలతో దరఖాస్తులు అందజేస్తే నష్టపరిహారం కోసం ప్రతిపాదనలు పంపించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

మనస్తాపంతో డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య



శైలజ (ఫైల్)

బెల్లంపల్లిరూరల్: పరీక్షలో ఫెయిలయ్యానని మనస్తాపంతో డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. తాళ్లగురిజాల ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం పెర్కపల్లి గ్రామానికి చెందిన రైతు కందుల రాజయ్య, రాణి దంపతుల కుమార్తె కందుల శైలజ(22) బెల్లంపల్లిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతోంది. ఇటీవల వార్షిక పరీక్షలు రాయగా వారంరోజుల క్రితం ఫలితాలు వెలువడ్డాయి. అన్ని సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురైంది. ఈ నెల 3న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు ముందుగా బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వర్షానికి కూలిన పెంకుటిళ్లు



కూలిన పెంకుటిళ్లు

జైపూర్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని వేలాలలో ప్యాగ రాజమ్మ–మధునయ్య దంపతులకు చెందిన పెంకుటిళ్లు కూలిపోయింది. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మంగళవారం ఉదయం ఇళ్లు కూలినట్లు బాధితులు తెలిపారు. ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

నేడు పీసీసీఎఫ్ పర్యటన

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం డివిజన్‌లో బుధవారం రాష్ట్ర అటవీ ముఖ్య సంరక్షణ అధికారి (పీసీసీఎఫ్) జైస్వాల్ పర్యటిస్తారని ఎఫ్‌డీవో మాధవరావు మంగళవారం తెలిపారు. గడ్డి మైదానాలు పరిశీలన, జింకల పునరుత్పత్తి కేంద్రం, మూషిక జింకల పునరుత్పత్తి కేంద్రాలను ప్రారంభిస్తారని తెలిపారు. జైస్వాల్‌తో పాటు గడ్డి మైదానాల నిపుణుడు మురత్కర్, వివిధ ప్రాంతాల నుంచి అటవీ అధికారులు రానున్నట్లు ఆయన తెలిపారు.

ఉత్తరం రాద్దాం.. బహుమతి గెలుద్దాం

- లేఖ రచనను ప్రోత్సహించేందుకు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలు
- విజేతలకు నగదు బహుమతులు
- విద్యార్థులకు అవగాహన కల్పించే దిశగా తపాలాశాఖ



నిర్మల్‌చైన్‌గేట్/నేరడిగొండ: నేటి సాంకేతిక యుగంలో ప్రతి ఒక్కరూ సెల్‌ఫోన్, ఈ–మెయిల్స్, వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతున్నారు. ఐదు దశాబ్దాల ముందుకు వెళ్తే ఉత్తర ప్రత్యుత్తరాలు కేవలం లేఖల ద్వారానే జరిగాయి. దూరప్రాంతాల్లో ఉన్న వారి క్షేమ సమాచారాన్ని ఉత్తరం, టెలిఫోన్, టెలిగ్రామ్ ద్వారా తెలుసుకునే పరిస్థితి ఉండేది. సెల్‌ఫోన్ వినియోగం.. ముఖ్యంగా ఆండ్రాయిడ్ ఫోన్స్ వాడకం తర్వాత సమాచార వ్యవస్థలో విప్లవం వచ్చిందని చెప్పవచ్చు. నేటి తరానికి ఇంచుమించుగా ఉత్తరం అంటే తెలియని పరిస్థితి ఉంది. అందుకే ఉత్తరాన్ని తిరిగి పరిచయం చేసేందుకు, తెలిసిన వారికి మరోసారి గుర్తు చేసేందుకు తపాలా శాఖ నడుం బిగించింది. ఇందులో భాగంగా లేఖరులకు పోటీ పెడుతోంది.

‘డిజిటల్ ఇండియా ఫర్ న్యూ ఇండియా’...

ప్రస్తుత డిజిటల్ యుగంలో ఉత్తరాలకు ప్రాధాన్యం తగ్గింది. దూర ప్రాంతాల్లో ఉన్న వారి క్షేమ సమాచారం తెలియజేయాలన్నా, వ్యాపార అవసరాల నిమిత్తం సమాచారం పంపించాలన్నా ఒకప్పుడు పెన్ను, పేపరు తీసుకుని లేఖలు రాసేవారు. ఇప్పుడా పరిస్థితి ఎక్కడా కానరాదు. మొబైల్ ఫోన్ ద్వారా సమస్త సమాచారాన్ని క్షణాల్లో వివిధ మార్గాల్లో చేరవేస్తున్నారు. ఫోన్ లోనే ప్రత్యక్షంగా వాయిస్ కాల్, వీడియో కాల్స్ ద్వారా మాట్లాడుకునే పరిస్థితి ఉంది. ఖండాంతరాల్లో ఉన్న వారితో సైతం వీడియో కాల్ ద్వారా మాట్లాడే పరిస్థితి ఉండడంతో లేఖల ద్వారా ఉత్తర, ప్రత్యుత్తరాలు మర్చిపోయిన పరిస్థితి ఉంది. ఒకప్పటి సమాచార సాధనమైన ఉత్తరాన్ని నేటి యువతరానికి గుర్తు చేసేందుకు తపాలా శాఖ లేఖారచన పోటీలకు శ్రీకారం చుట్టింది. ‘డిజిటల్ ఇండియా ఫర్ న్యూ ఇండియా’ అనే అంశంపై లేఖలను ఆహ్వానిస్తోంది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ‘ఢాయి ఆఖర్’ పేరుతో పోటీలు నిర్వహిస్తోంది.

రెండు విభాగాల్లో..

ఈ పోటీల్లో భారతదేశ పౌరులు పాల్గొనవచ్చు. 18 ఏళ్ల లోపు వారికి ఒక కేటగిరీ, ఆపై వారిని మరో కేటగిరీగా విభజించి పోటీలు నిర్వహిస్తున్నారు. తెలుగు, ఇంగ్లిషు, హిందీ భాషల్లో వ్యాసం రాయవచ్చు. డిజిటల్ విధానంతో పాలన, మౌలిక సదుపాయాలు, అక్షరాస్యత, డిజిటల్ పేమెంట్స్ తదితర అంశాలను అందులో పొందుపర్చారు. ఏ4 సైజ్ పేపరుపై రాసి ఎన్వలప్ కవర్‌లో పంపించవచ్చు. ఎన్వలప్ కవర్ అయితే వెయ్యి పదాలకు మించకుండా, ఇన్‌ల్యాండ్ లెటర్ అయితే 500 పదాలకు మించకుండా రాయాల్సి ఉంటుంది. కంప్యూటర్, ఇతర ఎలక్ట్రానిక్స్ సాధనాల్లో టైప్ చేసిన లేఖలను పోటీకి అనుమతించరు. వ్యాసం చేతితో మాత్రమే రాసి పంపించాలి. లేఖలు పంపించే వారు వారి వయసును నిర్ధారిస్తూ సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలి. పోటీలో గెలిస్తే వారి వయస్సు, ఐడీ ధ్రువీకరణకు అవసరమైన పత్రాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా రాసిన ఉత్తరాలను ఎస్‌పీవోఎస్, ఆదిలాబాద్ డివిజన్ చిరునామాకు అక్టోబరు 31లోగా పంపించాలి.

బహుమతులు ఇలా..

రెండు కేటగిరీల వారీగా రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో విజేతలను ఎంపిక చేస్తారు. రాష్ట్రస్థాయిలో ఒక్కో విభాగంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి 12 మందికి మించకుండా ప్రథమ రూ.25 వేలు, ద్వితీయ రూ.10 వేలు, తృతీయ బహుమతి రూ.5వేలు, జాతీయ స్థాయిలో విజేతలుగా నిలిచిన వారికి ప్రథమ రూ.50 వేలు, ద్వితీయ రూ.25 వేలు, తృతీయ రూ.10 వేల నగదు అందజేస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సదవకాశం. వయసుతో పనిలేకుండా ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఇచ్చిన అంశానికి సంబంధించి స్వదస్తూరితో వ్యాసం రాసి పోస్ట్ చేయాలి.

– ఎస్.అనిల్ కుమార్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తపాలా శాఖ పర్యవేక్షకులు

స్క్రాప్ స్వాధీనం

మందమర్రిరూరల్: పట్టణంలోని ఫిల్టర్‌బెడ్ ఏరియా సమీపంలోని అటవీప్రాంతంలో తరలించేందుకు సిద్ధంగా ఉన్న స్క్రాప్‌ను సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌అండ్‌పీసీ సీనియర్ ఇన్‌స్పెక్టర్ సుంకరి రమేశ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు అక్కడికి వెళ్లగా గుర్తుతెలియని వ్యక్తులు పోగు చేసుకుని ఆటోలో తరలించడానికి సిద్ధంగా ఉన్న సింగరేణికి సంబంధించిన సుమారు టన్నున్నర స్క్రాప్‌ను గుర్తించి మందమర్రిలోని ఎస్‌అండ్‌పీసీ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు.

‘తారలే తారంగమాడే వేళ’ ఫస్ట్‌లుక్ విడుదల



విడుదలైన పోస్టర్

చెన్నూర్: చెన్నూర్ టాకీస్ బ్యానర్‌పై తీస్తున్న ‘తారలే తారంగమాడే వేళ’ ఫస్ట్‌లుక్‌ను నిర్మాత చెన్నూరి శ్రీవాణి మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పాటను చెన్నూర్‌లో చిత్రీకరించడం సంతోషంగా ఉందన్నారు. పాటను త్వరలోనే చెన్నూర్ టాకీస్ యూట్యూబ్ ఛానల్‌లో విడుదల చేయనున్నట్లు తెలిపారు.

నల్లబ్యాడ్జీలతో మైనింగ్ ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న మైనింగ్ స్టాఫ్

జైపూర్(చెన్నూర్): సింగరేణిలో ఉద్యోగ విరమణ పొందిన అధికారులు, సూపర్‌వైజర్లను ఎంవీటీసీలలో కాంట్రాక్టు పద్ధతిన నియమించడానికి జారీచేసిన ఉత్తర్వులు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఐకే1ఏ, ఐకేఓసీపీపై మైనింగ్ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం గని మేనేజర్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మైనింగ్ స్టాఫ్ అన్వేష్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రమణకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, బలరాం, రమేశ్, ఇక్బాల్, రాజేశం, బంటాని శ్రీనివాస్, మల్లేశ్, ఉదయ్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఏరియర్స్ ఒకే దఫాలో చెల్లించాలి



ఆందోళన చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నస్పూర్: సింగరేణి కార్మికులకు 11వ వేజ్‌బోర్డుకు సంబంధించిన 23 నెలల ఏరియర్స్, లాభాల్లో 35 శాతం వాటా ఒకే దఫాలో చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం జీఎం సంజీవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే.వీరభద్రయ్య మాట్లాడుతూ ఏరియర్స్ చెల్లింపులో కాలయాపన చేస్తూ కార్మికులను అసంతృప్తికి గురిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ బ్రాంచి కార్యదర్శి ముస్కె సమ్మయ్య, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, సీపీఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్టు



పోలీసుల అదుపులో నిందితుడు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో వరుస చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ టి.శంకరయ్య తెలిపారు. పట్టణంలోని షంషీర్ నగర్ బస్తీకి చెందిన మురుకుట్ల కిరణ్ దురలవాట్లకు బానిసై కొంతకాలంగా చోరీలకు పాల్పడుతున్నాడు. బస్తీలో ఉన్న నందిని టెంట్‌హౌజ్‌లో కూలీగా పనిచేస్తున్న కిరణ్ ఈ నెల 2న రాత్రి టెంట్‌హౌజ్ యాజమాని రాజ్‌కుమార్ చేతికి టెంట్‌హౌజ్ బకాయిలు రూ.3.20 లక్షలు అందినట్లు తెలుసుకున్నాడు. అదే రోజు రాత్రి రాజ్‌కుమార్ ఇంటికి తాళం వేసి మందమర్రిలో ఉన్న తన చెల్లెలు ఇంటికి వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన కిరణ్ ఇంటి వెనకాల ఉన్న తలుపును ఇనుపరాడ్‌తో పగులగొట్టి ఇంట్లోకి వెళ్లి రూ.3.20 లక్షలు అపహరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కిరణ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా తాజా చోరీతో పాటు గతంలో చేసిన దొంగతనాల చిట్టా వివరించాడు. 2022 సెప్టెంబర్‌లో బెల్లంపల్లిబస్తీలో, నవంబర్‌లో బజారు ఏరియాలో ఉన్న ముఖేష్ డ్రెస్సెస్‌లో,ఈ ఏడాది ఏప్రిల్‌లో బెల్లంపల్లి బస్తీలోని ఓ ఇంట్లో చోరీ చేసినట్లు నిందితుడు అంగీకరించినట్లు ఎస్‌హెచ్‌ఓ శంకరయ్య పేర్కొన్నారు. నిందితుడి వద్ద నుండి రూ.2,06 ,910 నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కార్మికుల సమస్యలపై సీఎల్‌సీ సమక్షంలో చర్చలు



చర్చలు జరుపుతున్న శ్రీనివాసులు

జైపూర్: మండల కేంద్రంలోని ఎస్టీపీపీ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం బీఎంఎస్, హెచ్‌ఎంఎస్ యూనియన్ల ఆధ్వర్యంలో పలు దఫాలుగా సమ్మె నోటీసులు అందించగా మంగళవారం హైదరాబాద్‌లో డెప్యూటీ సీఎల్‌సీ(చీఫ్ లేబర్ కమిషనర్) డి.శ్రీనివాసులు సమక్షంలో వేర్వేరుగా చర్చలు జరిపారు. హెచ్‌ఎంఎస్, బీఎంఎస్ యూనియన్ల ప్రతినిధులు, సింగరేణి అధికారులు, పవర్‌మేక్ కంపెనీ అధికారులతో కార్మిక సమస్యలపై చర్చించారు. వారం రోజుల్లోగా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో సమ్మెకు వెళ్తామని యూనియన్ ప్రతినిధులు స్పష్టం చేశారు. అనంతరం బీఎంఎస్ నాయకులు డైరెక్టర్ బలరాంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, ఎస్టీపీపీ అనుబంధ హెచ్‌ఎంఎస్ ప్రతినిధులు విక్రమ్, చిప్పకుర్తి సంపత్, ప్రదీప్, సాయికృష్ణ, రమేశ్, బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి దుస్స భాస్కర్, కార్యనిర్వహణ అధ్యక్షుడు పేరం రమేశ్, అధ్యక్షుడు చినూరి రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకటేశ్ పాల్గొన్నారు.

ఇరురాష్ట్రాల పోలీస్ అధికారుల సమావేశం



సమావేశంలో పాల్గొన్న పోలీస్ అధికారులు

జైపూర్(చెన్నూర్): మండల కేంద్రంలోని ఎస్టీపీపీ ప్రాణహిత అతిథిగృహంలో మంగళవారం జైపూర్ ఏసీపీ మోహన్ ఆధ్వర్యంలో జైపూర్ సబ్ డివిజన్, సిరోంచ పోలీస్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో రాబోయే ఎన్నికల దృష్ట్యా సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో సరిహద్దు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో బెల్లంపల్లి ఏసీపీ సదయ్య, సిరోంచ డీఎస్పీ సుహాస్ షిండే, శ్రీరాంపూర్ సీఐ రమేశ్ బాబు, చెన్నూర్‌రూరల్ సీఐ విద్యాసాగర్, సిరోంచ సీఐ సుదర్శన్ కట్కర్, బామిని సీఐ మదన్ మస్కే, రేగుంట సీఐ కృష్ణ కాటే, వెంకటాపూర్ ఎస్సై అజింక జాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ కళకు ‘ప్రతిభా’ పురస్కారం

- వెడ్మ శంకర్‌కు దక్కిన గౌరవం
- కిక్రీ వాయిద్యంలో అందవేసిన చేయి



ప్రతిభా పురస్కారం అందుకుంటున్న శంకర్



కిక్రీ వాయిస్తున్న వెడ్మ శంకర్ (ఫైల్)

తిర్యాణి(ఆసిఫాబాద్): సాధారణంగా ఆదివాసీలు సంస్కృతి, సంప్రదాయాలతో పాటు కళారంగంపై మక్కువ చూపుతారు. పురాతన కాలం నుంచి ఆదివాసీలు సృష్టి, వంశపురాణాలపై పాటల రూపంలో గానం చేస్తుండేవారు. మారుతున్న కాలంతో పాటు కళారంగంలో సైతం మార్పులు వస్తుండడంతో అధునాతన పరికరాలతో సంగీతం కొత్త పుంతలు తొక్కుతోంది. ఈ నేపథ్యంలో ప్రాచీన కళలు రోజురోజుకు అంతరించిపోతున్నాయి. ఈ సమయంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం వెడ్మ శంకర్ కళను గుర్తించి ప్రతిభా పురస్కారం అందించడంతో ప్రాచీన కళకు జీవం పోసినట్లుగా మారింది.

రోజుల తరబడి గానం చేసే సామర్థ్యం...

తిర్యాణి మండలంలోని ఎదులపహాడ్ గ్రామానికి చెందిన వెడ్మ శంకర్ ఆదివాసీల్లో అత్యంత వెనుకబడి ఉన్న తోటి తెగకు చెందినవాడు. చిన్ననాటి నుంచే కళారంగంపై మక్కువ పెంచుకున్న శంకర్ తన పెద్దనాన్న కుమారుడైన రాము కళాబృందంతో తిరుగుతూ కిక్రీ (వీణ వంటి సంగీత వాయిద్యాం) నేర్చుకున్నాడు. విలక్షణ సంస్కృతి, సంప్రదాయాలు కలిగిన గోండు తెగ చెందిన వారు తమ ఇంట్లో జరిగిన శుభ, అశుభ కార్యక్రమాల్లో తమ వంశం లేదా గోత్రానికి సంబంధించిన చరిత్రను తోటి కళాకారులతో పాటలు, కథల రూపంలో చెప్పించుకోవడం అనాదిగా వస్తోంది. అంతేకాకుండా తోటి కళాకారులతో పాటలు పాడిస్తే వర్షాలు కురుస్తాయన్న నమ్మకం గోండులల్లో ఉంది. అదే కళను నమ్ముకున్న వెడ్మ శంకర్ కిక్రీ వాయిద్యంతో తన కళను కొనసాగిస్తున్నాడు. అంతేకాకుండా డక్కా, కర్నడ్, సన్నాయి, ఖాళీకోం లాంటి పురాతన సంగీత వాయిద్యాలను సైతం వాయించడం నేర్చుకున్నాడు. ఈ నేపథ్యంలో తెలుగు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య బట్టు రమేశ్ ఆధ్వర్యంలో 2021లో శంకర్ ఇంటికి వెళ్లి 9 రోజుల పాటు అతని కళను వీడియో రికార్డు చేశారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2021 ప్రతి భా పురస్కారాల ప్రదానోత్సవంలో భాగంగా గత నెల 30న జానపద కళారంగం విభాగంలో వెడ్మ శంకర్‌కు ప్రతిభా పురస్కారం అందించడం జరిగింది...

మరింత ఉత్సాహం



కిక్రీ వాయిద్యంతో సంస్కృతి, సంప్రదాయాలను కథలు, పాటల రూపంలో గానం చేస్తూ వస్తున్నా. పురాతన జానపద కళారంగాన్ని తెలుగు విశ్వవిద్యాలయం గుర్తించి 2021 సంవత్సరానికి గానూ ప్రతిభా పురస్కారం అందజేయడం మరింత ఉత్సాహం కలిగిస్తోంది.

– వెడ్మ శంకర్, కిక్రీ కళాకారుడు

బోనస్ డబ్బులకోసం తునికాకు కూలీల ఆందోళన



సెక్షన్ అధికారిని నిలదీస్తున్న కూలీలు

వేమనపల్లి(బెల్లంపల్లి): బోనస్ డబ్బులు రావడంలేదని మంగళవారం తునికాకు కూలీలు అటవీ సెక్షన్ అధికారి కార్యాలయం ఎదుట సింగిల్‌విండో చైర్మన్ కుబిడె వెంకటేశం ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. కల్లాదార్ల కుటుంబాల్లో ఏనాడు తునికాకు సేకరణకు వెళ్లకున్నా రూ.50 వేలు, రూ.60 వేలు జమ అయ్యాయని, తమకు బోనస్ డబ్బులు రావడం లేదని మండల కేంద్రంతో పాటు రాజారాం, సుంపుటం, జాజులపేట గ్రామాలకు చెందిన కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఎఫ్‌ఎస్‌ఓ రవికుమార్, ఎఫ్‌బీఓ పోచయ్య విషయాన్ని కుశ్నపల్లి రేంజ్ అధికారి గోవింద్‌చంద్‌సర్దార్ దృష్టికి ఫోన్ ద్వారా తీసుకెళ్లగా ఖాతా నంబర్లు సరిగాలేని కొందరికి బోనస్ డబ్బులు పడలేదని అవి సరిచేసి పంపామని, విడతల వారీగా కూలీల ఖాతాల్లో జమ అవుతున్నాయన్నారు.

17న ఎక్స్‌టర్నల్ అభ్యర్థులకు రాతపరీక్ష

నస్పూర్: సింగరేణి సంస్థలో మోటర్ మెకానిక్, కేటగిరీ–1 ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న ఎక్స్‌టర్నల్ అభ్యర్థులకు ఈ నెల 17న రాతపరీక్ష నిర్వహించనున్నట్లు జీఎం పర్సనల్ వెల్ఫేర్ అండ్ ఆర్‌సీ కే.బసవయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తగూడెంలోని మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో మధ్యాహ్నం 2 నుంచి 3:30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 6 నుంచి www.scclmines.com వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన సూచించారు.

‘132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి’

జన్నారం: జన్నారం మండల ప్రజలు, రైతుల ఇబ్బందులు గుర్తించి 132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు భుక్య జానుబాయి డిమాండ్ చేశారు. సామాజిక వేత్త శ్రీరాముల భూమాచారి చేపట్టిన రిలే నిరాహార దీక్షకు మంగళవారం మద్దతు తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు గోలి చందు, బీజేవైఎం నాయకుడు మహేశ్, రాజన్న, అరవింద్, రవి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే నవసమాజ నిర్మాతలు



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్: ఉపాధ్యాయులే నవ సమాజ నిర్మాతలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ఉట్నూర్ కుమురంభీం ప్రాంగణంలోని పీఎంఆర్సీ సమావేశ మందిరంలో మంగళవారం గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో, గురుకులాల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, స్కూల్‌అసిస్టెంట్లు, ఎస్‌జీటీలను ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మొత్తం 76మంది ఉత్తమ ఉపాధ్యాయులను అవార్డులతో సత్కరించారు. గిరిజన ఆశ్రమ విద్యార్థులను సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. విద్యార్థులు నూతన అంశాలపై ఉత్సాహం చూపిస్తారని వారి స్థాయికి అనుగుణంగా బోధించాలని కోరారు. విద్యార్థి తల్లిదండ్రులతో కాకుండా ఎక్కువ కాలం గడిపే ప్రదేశం పాఠశాల అని పాఠశాల వాతావరణం విద్యార్థికి ఆహ్లాదకరంగా ఉండే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో డీడీ దిలీప్‌కుమార్, ఏపీవో పీవీటీజీ భాస్కర్, ఏటీడీవోలు, ఏసీఎంవోలు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతీ యువకులు ఉచిత విద్య, ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, టెన్త్, ఇంటర్ పూర్తి చేసిన అభ్యర్థులకు ఈ నెల 8న శుక్రవారం ఉదయం 9గంటలకు ఉట్నూర్ కేబీ ప్రాంగణంలోని యువజన శిక్షణ కేంద్రంలో ఎంపిక ఉంటుందని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్ఎన్ గ్రూప్ ఆఫ్ కంపెనీలో ఉద్యోగ అవకాశం, ఉచిత విద్యలో ఎంపిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు 17–20 సంవత్సరాల మధ్య ఉండి పదో తరగతిలో 60 శాతం, ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ లేదా బైపీసీ లేదా ఒకేషనల్‌కోర్స్ 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆసక్తి గల ఉమ్మడి జిల్లా గిరిజన నిరుద్యోగ యువతీ యువకులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9493535052 నంబరులో సంప్రదించాలని కోరారు.

వీవోఏల కృతజ్ఞత సభ



మాట్లాడుతున్న బాల్క సుమన్

నస్పూర్: పొదుపు సంఘాల ద్వారా మహిళలను సంఘటితం చేస్తూ మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధిలో గ్రామ సంఘ సహాయకులు చేస్తున్న కృషి అభినందనీయమని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. మంగళవారం నస్పూర్‌లోని ఐడీవోసీలో గ్రామ సంఘ సహాయకుల జిల్లా స్థాయి కృతజ్ఞత సభ నిర్వహించారు. కార్యక్రమానికి పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత, మంచిర్యాల, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, చిన్నయ్య, కలెక్టర్ బదావత్ సంతోష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సెర్ప్ పరిధిలో 4,31,402 మహిళా సంఘాలు, 46,21,272 మంది సభ్యులు ఉన్నారని వివరించారు. చెన్నూర్ నియోజక వర్గంలోని ప్రతీ గ్రామంలో సమ్మక్క–సారలమ్మ మహిళా భవనాలు నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో శేషాద్రి, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, జెడ్పీటీసీలు, గ్రామ సంఘ సహాయకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.